

కోన్‌రెడ్డిచెర్వులోని పెద్దమ్మ ఆలయ ఉత్సవాల్లో పాల్గొన్న గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

భువనగిరిలో గులాబీ జెండా ఎగురడం ఖాయం

- ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

రాజాపేట, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరిలో గులాబీ జెండా ఎగురడం ఖాయమని ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కోన్‌రెడ్డిచెర్వు గ్రామంలోని పెద్దమ్మ ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముదిరాజ్ సంఘం నాయకులతో సమావేశమై మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేషం విజయం ఖాయమని, లక్ష మెజార్టీ కోసం కృషి చేయాలని కోరారు. తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలనే కావాలని కోరుకుంటున్నారని, పాలన చేతకాని కాంగ్రెస్ దద్దమ్మలకు ఓటు వేశామని మనోవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గడప గడపకూ వివరిస్తూ క్యామ మల్లేశం గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఆమె వెంట బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గొల్లపల్లి రాంరెడ్డి, మండల సెక్రెటరీ జనరల్ సందిల భాస్కర్‌గౌడ్, మాజీ సర్పంచ్ చెరుకు విజయాకనకయ్య, ఎంపీటీసీ ఎడ్ల నరేశ్‌రెడ్డి, ఉచ్చెంతల మల్లేశం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సునీత

మహిళల్లో చైతన్యంతోనే సమ సమాజ నిర్మాణం

- వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సునీత

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 28 : మహిళల్లో చైతన్యం తేవడం ద్వారానే సమ సమాజ నిర్మాణం సాధ్యమని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సునీతారామ్మోహన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఫంక్షన్‌హాల్లో ఆదివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అభ్యసన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సమాజంలో సగభాగం మహిళలు ఉన్నారని, వారిలో చైతన్యం తెచ్చే కార్యక్రమాలను కార్యకర్తలు చేపట్టాలని సూచించారు. సనాతన ధర్మంలో నారీ శక్తికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, దానిని గుర్తించి తగిన విధంగా ఉపయోగించుకుంటే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం పాశ్చాత్య ధోరణులు, వికృత చేష్టలతో నారీ శక్తిని నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీహెచ్‌పీ తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు నరసింహమూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రాంత సహ సంయోజిక శ్రీవాణి, నల్లగొండ విభాగ్ సంయోజిక సత్యవతి, భాగ్యలక్ష్మి, విభాగ్ సంయోజిక జ్యోతి సహ సంయోజిక అరుంధతి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సుర్వి లావణ్య, దొంత సుమిత్ర, సత్యలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు పొత్నక్ రాఘవేందర్, ప్రాంత సహ కార్యదర్శి తోట భాను ప్రసాద్, జిల్లా కార్యదర్శి సుక్కల శ్రీశైలం యాదవ్, నాయకులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన రెడ్లరేపాక గ్రామశాఖ కార్యవర్గం

బీఆర్ఎస్ రెడ్లరేపాక గ్రామశాఖ ఎన్నిక

వలిగొండ, ఏప్రిల్ 28 : మండలంలోని రెడ్లరేపాక గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ జిల్లా నాయకులు రేపాక ప్రదీప్‌రెడ్డి, మాద శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పార్టీ గ్రామ శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జువ్వగాని సుమన్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా పాల్వంచ గణేశ్, కందుల జాని, కార్యదర్శిగా కోమల్ల కుమార్, ప్రధాన కార్యదర్శిగా కొలను శ్రవణ్‌రెడ్డి, సలహాదారుడిగా జువ్వగాని శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారిగా మార్క సత్యనారాయణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రేపాక సందీప్‌రెడ్డి, దంతూరి రఘునాథం, సూర్య నారాయణ, పంతంగి కిష్టయ్య, సుక్క యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, చెవ్వ భిక్షపతి పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న పరిశ్రమ ఉద్యోగులు

రాష్ట్ర స్థాయి సేఫ్టీ కాంపిటీషన్స్‌లో దివీస్‌కు బహుమతులు

చౌటుప్పల్, ఏప్రిల్ 26 : రాష్ట్రా స్థాయి సేఫ్టీ కాంపిటీషన్స్‌లో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం వద్ద ఉన్న దివీస్ పరిశ్రమ ఉద్యోగులు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందుకున్నట్లు పరిశ్రమ అధికారులు తెలిపారు. వరల్డ్ డే ఫర్ సేఫ్టీ అండ్ హెల్త్ ఎట్ వర్క్ 2024ను పురస్కరించుకొని నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ తెలంగాణ చాప్టర్ వారు ఈ పోటీలను నిర్వహించారు. ఇందులో దివీస్ ఉద్యోగులకు పోయమ్స్‌లో ప్రథమ, సేఫ్టీ స్లోగన్స్‌లో ద్వితీయ బహుమతులు లభించాయి. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పరిశ్రమల శాఖ అధికారుల నుంచి వారు బహుమతులు అందుకున్నారు. పరిశ్రమ ఉద్యోగులు భద్రతపై నిర్వహించిన ప్రదర్శించిన ఆకట్టుకున్నట్లు కంపెనీ అధికారులు తెలిపారు.

కంఠమహేశ్వరాలయంలో ఎమ్మెల్యే కుంభం పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 28 : మండలంలోని వీరవెల్లి గ్రామంలో గౌడ కులస్తులు నిర్మించిన కంఠ మహేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనీల్‌కుమార్‌రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను గౌడ కులస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల సందడి



యాదగిరిగుట్ట ఆలయ క్యూలైన్‌లో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 28: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో స్వయంభూ నారసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పరిసరాలన్నీ భక్తులతో నిండిపోయాయి. తిరు మాడవీధులు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, గర్భాలయ ముఖ మండపంలోని క్యూలైన్ల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. కొండపైకి వాహనాల రద్దీ కొనసాగింది. స్వామివారి ధర్మ దర్శానికి 2 గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. నిత్య తిరుకల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు జరిగే సువర్ణపుష్పార్చన, వేద ఆశీర్వచనంలోనూ భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల నిత్యార్చనలు తెల్లవారుజామున ప్రారంభమయ్యాయి. స్వామివారికి పంచామృతాభిషేకం, గంగాజలాలలో నిజాభిషేకం జరిపి, భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్ర నామార్చనలు అత్యంత వైభవంగా సాగాయి. ప్రధానాలయంలోని కల్యాణమండపంలో స్వామి, అమ్మవార్లకు ఉదయం శ్రీసుదర్శన నారసింహహోమం, సాయంత్రం వెండి మొక్కు జోడు సేవలు, దర్బార్ సేవలు నిర్వహించారు. రాత్రి స్వామివారికి శయనోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు అత్యంత వైభవంగా జరిపారు. స్వామివారిని సుమారు 40 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. స్వామివారి ఖజానాకు రూ. 59.34,193 ఆదాయం సమకూరిందని ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

కరాటే శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మోత్కూరు, ఏప్రిల్ 28 : స్టాండర్డ్ షీటూరియా ఇంటర్నేషనల్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో మే 1 నుంచి జూన్ 5వరకు నిర్వహించే వేసవి కరాటే, జూడో శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మోత్కూరు కరాటే, జూడో మాస్టర్ అన్నెపు వెంకట్ కోరారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, సంతోష్ డిగ్రీ కళాశాలలో సాయంత్ర 5.30 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దాంతో పాటు వివేకానంద విద్యామందిర్ ఆవరణలో సోమ, బుధ, శనివారాల్లో ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పట్టణ, పరిసర ప్రాంత గ్రామాల విద్యార్థులు, యువకులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆవిష్కర్త సినిమా పాటలు విడుదల

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 28 : పట్టణ కేంద్రానికి చెందిన భోగ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆవని క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఆవిష్కర్త సినిమా మొదటి పాటను ఆదివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ విడుదల చేశారు. ఈ పాటను ప్రివ్యూ థియేటర్లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ ఈ సినిమా ప్రేక్షకుల ఆదరాభిమానాలను పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సినిమా డైరెక్టర్ భోగ ప్రవీణ్ కుమార్, నిర్మాత రుద్ర నవీన్, కెమెరామెన్ ఉపేంద్ర సురపల్లి, మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ కురాకుల, లిరిక్స్ రైటర్స్ గోపికృష్ణ శాకపూరి, ఆవని క్రియేషన్ ప్రతినిధి సాత్విక ప్రవీణ్ సినిమా నటీనటులు పాల్గొన్నారు.

రజక సంఘం రాష్ట్ర కార్యదర్శిగా తిరుమలేశ్

రాజాపేట, ఏప్రిల్ 28 : రజక సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన సట్టు తిరుమలేశ్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర నాయకులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తిరుమలేశ్ మాట్లాడుతూ రజక సంఘం కార్యదర్శిగా ఎంపిక చేసిన సంఘం రాష్ట్ర నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలందరూ బీఆర్ఎస్ వెంటే

- బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 28 : కొంత మంది అవకాశవాద నాయకులు డబ్బులు, పదవులకు ఆశపడి అధికార పార్టీలోకి పోతున్నారని..కానీ ప్రజలు మాత్రం బీఆర్ఎస్ వెంటే ఉన్నారని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఢిల్లీ మాధవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చౌటుప్పల్ మున్సిపాలిటీకి చెందిన కొంత మంది నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడం వల్ల వచ్చే నష్టమేమీ లేదని పేర్కొన్నారు. ప్రజలంతా బీఆర్ఎస్‌కు ఓటేయాలని నిర్ణయించుకున్నారని, అధికార పార్టీ నాయకులు ఎంతగా వలసలను ప్రోత్సహించినా పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేది మాత్రం బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశం మాత్రమే అని స్పష్టం చేశారు.

పెద్దమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

రాజాపేట, ఏప్రిల్ 28 : మండలంలోని కోన్‌రెడ్డిచెర్వులో కొత్తగా నిర్మించిన పెద్దమ్మ ఆలయంలో ఆదివారం విగ్రహాల ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా యంత్ర ప్రతిష్ఠ, బలి ప్రదానం, పూర్ణహుతి పూజలు చేపట్టారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నెమిలే మహేందర్‌గౌడ్, నాయకులు బుడిగే పెంటయ్యగౌడ్, మసిరెడ్డి సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు నరేశ్, గంధమల్ల నర్సింహులు, పాండవుల లక్ష్మణ్ గౌడ్, ఉచ్చేంతల శ్రీను, మొగిలి ఇస్తారి, ఐరేని నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



మహనీయుల జయంతి కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంఘాల నాయకులు

సమసమాజ నిర్మాణమే ధ్యేయం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 28 : అసమానతలు నిర్మూలించి సమ సమాజాన్ని నిర్మించడమే సంఘం ధ్యేయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలో బహుజన ప్రజాశక్తి ఆధ్వర్యంలో నిర్వహించిన మహనీయుల జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహనీయుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రజలను విద్య, విజ్ఞానానికి దూరంగా ఉంచి దౌర్జన్యంగా వెట్టి చేయించిన పనులు కులవృత్తులుగా మారాయన్నారు. సామాజిక విద్య, ఆర్థిక ఉపాధి, రాజకీయాల్లో అగ్రకుల అహంకారం ఆధిపత్యం చెలాయిస్తున్నదని, వాటికి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల అభ్యున్నతికి, హక్కుల సాధనకు సమిష్టిగా ఉద్యమించాలని కోరారు. బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేశ్ మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు బీసీ సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, నాయకులు చింత కింది రమేశ్, కొయ్యడ నరసింహ, చేరాల లింగయ్య, గునిగంటి మల్లేశం, భారత భూషణ్, చింతల ప్రకాశ్, కుక్క స్వామి, కరగల్ల కుమార్, నల్ల నగేశ్, సీత సత్యనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కొత్తగా చేసిందేమీలేదు

- బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలనే భర్తీ చేసింది
- నిరుద్యోగుల సమస్యలపై కొట్లాడేందుకే ఎమ్మెల్సీగా బరిలోకి దిగుతున్నా
- విద్యావేత్త పాలకూరి అశోక్‌కుమార్

మాట్లాడుతున్న పాలకూరి అశోక్ కుమార్

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 28 : ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేసిందేమీ లేదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలనే భర్తీ చేసి తామే ఇచ్చామని గొప్పలు చెబుతున్నదని విద్యావేత్త పాలకూరి అశోక్‌కుమార్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఆర్ గార్డన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలపై కొట్లాడేందుకు తాను నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టుభద్రుల ఎమ్మెల్సీ బరిలోకి స్వతంత్ర అభ్యర్థిగా దిగుతున్నానని తెలిపారు. గ్రూప్- 2 పోస్టులను తగ్గించారని, వాటిని పెంచాలని డిమాండ్ చేశారు. తాను 20 ఏండ్లుగా తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడిగా, అధ్యాపకుడిగా అనేక సేవలు అందించానని, వేల మంది పేద విద్యార్థులకు ఫీజుల్లో రాయితీ ఇస్తూ విద్యను అందించానని తెలిపారు. నిరుద్యోగుల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేసి జైలుకు సైతం వెళ్లానని చెప్పారు. ఇప్పటికీ నిరుద్యోగుల సమస్యలు అలానే ఉన్నాయన్నారు. నిరుద్యోగుల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉన్నదని, నిరంతరం ప్రభుత్వంపై పోరాడితేనే వారి సమస్యలు ఓ కొలిక్కి వస్తాయనే దృఢ సంకల్పంతో ఉన్నానని చెప్పారు. ప్రభుత్వాల పని తీరు నిర్లక్ష్యంగా ఉన్నదని, అందుకే నిరుద్యోగుల గొంతుకగా ప్రశ్నించేందుకు ఎమ్మెల్సీగా బరిలోకి దిగుతున్నానని తెలిపారు.

మట్టపల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్లు మనోజ్‌కుమార్, మాణిక్‌రావు, సూర్యవంశీ

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ఎన్నికల అబ్జర్వర్లు మనోజ్‌కుమార్, మాణిక్‌రావు, సూర్యవంశీ

మట్టపల్లి చెక్‌పోస్టుతోపాటు పలు పోలింగ్ కేంద్రాల పరిశీలన

మఠంపల్లి/ నేరేడుచర్ల/ గరిడేపల్లి, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల అబ్జర్వర్లు మనోజ్‌కుమార్, మాణిక్‌రావు, సూర్యవంశీ సూచించారు. మండలంలోని మట్టపల్లి కృష్ణా నది వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఆదివారం వారు పరిశీలించారు. చెక్‌పోస్టు రికార్డులను, సీజ్ చేసిన వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సదుపాయాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, బందోబస్తు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అనంతరం నేరేడుచర్ల, గరిడేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత, కేంద్ర ప్రాథమిక పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. చిల్లేపల్లి చెక్‌పోస్ట్ వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సూచించారు. వారి వెంట తాసీల్దార్లు సురిగి సైదులు, బండ కవిత, మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, ఆర్ఐ రాంబాబు ఉన్నారు.

బొల్లేపల్లిలో ధాన్యం కొనుగోళ్లపై విచారణ చేపట్టిన అధికారులు

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు

- పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి శ్రీనివాస్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 28 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఐకేపీ డీపీఎం సునిల్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని బొల్లేపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి జిల్లా అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్ ఆదేశాల నేపథ్యంలో ఆదివారం వారు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రం నుంచి రవాణా చేసిన రెండు లారీల సాధారణ రకం ధాన్యం గ్రేడ్ -ఏగా, ఆ తర్వాత పంపిన ధాన్యం కామన్ వెరైటీగా నిర్ధారించడం వల్ల రైతులు అయోమయ పరిస్థితుల్లో పడ్డారని విచారణలో తేలినట్లు అధికారులు తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారుల నిర్ధారణ మేరకు గ్రామ పరిధిలో ఉన్న ధాన్యం సాధారణ రకంగా తేలిందని చెప్పారు. ఈ ధాన్యం శాంపిల్స్ సైతం సాంకేతిక సిబ్బంది పరిశీలించి గ్రేడ్-బీగా నిర్ధారించారని, ఇకపై రైతులు సందిగ్ధం వదిలి కొనుగోళ్లు వేగవంతం చేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రామన్నపేట, ఏప్రిల్28 : రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్న 2001-2003 సైన్స్‌గ్రూప్ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తాము చదువుకునే నాటి రోజులను నెమరేసుకున్నారు. తమకు చదువు చెప్పిన అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మోహన్‌రెడ్డి, ఏడుకొండలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రామన్నపేటలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అబ్జర్వర్ రాబర్ట్‌సింగ్ క్షత్రియ

ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా ఓటర్లను చైతన్య పర్చాలి

- పార్లమెంట్ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాబర్ట్‌సింగ్ క్షత్రియ

రామన్నపేట, ఏప్రిల్28: ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించకునేలా ఓటర్లలో చైతన్యం తేవాలని పార్లమెంట్ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాబర్ట్‌సింగ్ క్షత్రియ అధికారులకు సూచించారు. రామన్నపేట పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని బోగారం గ్రామంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సంర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. అధికారులు ఎన్నికల విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట తాసీల్దార్ లాల్ బహదూర్, ఎస్ఐ మల్లయ్య, రెవెన్యూ అధికారులు బీఎల్ఓలు ఉన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 28 : మండలంలోని రాయిపల్లికి చెందిన తండ్రి, కొడుకు ఇటీవల ఈతకు వెళ్లి మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని ఆదివారం బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. రూ.10వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్ గౌడ్, మండల సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేశ్‌గౌడ్, ఆత్మకూరు(ఎం) ఎంపీటీసీ యాస కవిత, జిల్లా నాయకులు భిక్షపతి, నాగరాజు, మల్లేశం, శ్రీను పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న భోగ విష్ణు

చలివేంద్రం ప్రారంభం

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 28 : పట్టణ కేంద్రంలోని పాండురంగస్వామి భజన మండలి ఆధ్వర్యంలో చేనేత సహకార సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం సంఘం నాయకుడు భోగ విష్ణు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భజన మండలి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండలి అధ్యక్షుడు చక్రాల నర్సింహ, ప్రధాన కార్యదర్శి పుప్పాల నాగేశ్వర్, సహాయ కార్యదర్శి దోరణాల శ్రీనాథ్, కోశాధికారి కొంగరి పండరినాథ్, ప్రతినిధులు సీత సత్యనారాయణ, రుద్ర బాలాజీ, భువనగిరి యాదగిరి, నోముల అశోక్, రుద్ర ఆంజనేయులు, కొంగరి గోపాల్ పాల్గొన్నారు.